క్లుప్తంగా

నేడు కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశం

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని తిరుమల ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఉదయం 10గంటలకు కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నట్లు పార్టీ కార్పొరేషన్ అధ్యక్షుడు పి.వెంకట్‌రెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి బాలాపూర్, బడంగ్‌పేట్, అల్మాస్‌గూడ, నాదర్‌గుల్, గుర్రంగూడ, కుర్మల్‌గూడ, సుల్తాన్‌పూర్, రాగన్నగూడ, మామిడిపల్లి, తదితర ప్రాంతాలలోని కాంగ్రెస్ శ్రేణులు, ఎన్‌ఎస్‌యూఐ నాయకులు, యూత్ కాంగ్రెస్, రైతు సంఘాల నాయకులు, మహిళా సంఘాలు, మహిళా ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నేడు ఆత్మీయ సమ్మేళనం

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని అల్మాస్‌గూడలోని చప్పిడి ఆడివిరెడ్డి గార్డెన్‌లో ఆదివారం ఉదయం 10 గంటలకు బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు పార్టీ కార్పొరేషన్ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి సబితారెడ్డి హాజరవుతారని చెప్పారు. అల్మాస్‌గూడ పరిధిలోని 7 డివిజన్ల ప్రజలు, కార్పొరేటర్లు, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు హాజరై ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఓఆర్‌ఆర్‌పై లారీ బోల్తా


ఓఆర్‌ఆర్‌పై బోల్తా పడిన లారీ

తుక్కుగూడ: ఓఆర్‌ఆర్‌పై లారీ బోల్తాపడి క్లీనర్ గాయపడ్డాడు. ఈ ఘటన మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాలలో శనివారం చోటు చేసుకుంది. బాధితులు, స్థానికులు తెలిపిన ప్రకారం.. శంషాబాద్ నుంచి బత్తాయి లోడుతో పెద్దఅంబర్‌పేట పండ్ల మార్కెట్ వైపు వెళ్తున్న లారీ రావిర్యాల టోల్ ఎగ్జిట్-13 వద్దకు రాగానే టైర్ పగిలి డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా పడింది. దీంతో క్లీనర్ గాయపడ్డాడు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

బీసీల ఐక్యతతోనే రాజ్యాధికారం

బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీరాములు యాదవ్

తుక్కుగూడ: బీసీల ఐక్యతతోనే రాజ్యాధికారం సాధ్యమవుతుందని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్ అన్నారు. శనివారం మున్సిపాలిటీ కేంద్రంలో పార్టీ ఓబీసీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లె పల్లెకు ఓబీసీ-ఇంటింటికి బీజేపీ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ బీసీలను చిన్నచూపు చూస్తున్నారని ఆరోపించారు. మంత్రి వర్గంలో బీసీలకు సరైన ప్రాధాన్యం కల్పించడం లేదన్నారు. కేవలం ముగ్గురు బీసీలు మాత్రమే మంత్రులుగా కొనసాగుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రంలో ప్రధాని మోదీ నాయకత్వంలో బీసీల అభ్యున్నతికి కృషి చేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, సుదర్శన్‌రెడ్డి, పోరెడ్డి అర్జున్‌రెడ్డి, కడారి జంగయ్య యాదవ్, బోసుపల్లి ప్రతాప్, ఎగ్గిడి సత్తయ్య, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడి నియామకం


అంజయ్యగౌడ్

కందుకూరు: బీఆర్‌ఎస్ నియోజకవర్గం ఉపాధ్యక్షుడిగా మండల పరిధిలోని పులిమామిడికి చెందిన అనేగౌని అంజయ్యగౌడ్, పార్టీ నియోజకవర్గ యూత్ ఉపాధ్యక్షుడిగా గూడూరుకు చెందిన బనవోలు శ్రీకాంత్‌రెడ్డి నియమితులయ్యారు. ఈమేరకు శనివారం మంత్రి సబితారెడ్డి వారికి నియామక పత్రాలను అందించారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమకు పదవి రావడానికి కారణమైన మంత్రితో పాటు ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

లక్ష్మీనర్సింహ స్వామికి ప్రత్యేక పూజలు



తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని జిన్నాయిగుట్ట లక్ష్మీనర్సింహ ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారికి ప్రీతియైన రోజు కావడంతో ప్రత్యేక అభిషేకాలు చేసి అలంకరించారు. భక్తులు పెద్ద ఎత్తున మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ శివశంకర్, పూజారులు అజయ్‌శర్మ, మురళిశర్మ, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ‘సహకారం’

- అర్హత ఉన్న వారికి స్వల్ప, దీర్ఘకాలిక రుణాలు
- అన్నదాతలకు అందుబాటులో ఎరువులు, విత్తనాలు, తాండూరు కంది పప్పు



మహేశ్వరం సహకార సంఘం కార్యాలయం

మహేశ్వరం: రైతులకు రుణాలతో పాటు సకాలంలో ఎరువులు, విత్తనాలు అందించి వారు పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు చేస్తూ అన్నదాతల ఆర్థికాభివృద్ధి కోసం మహేశ్వరం సహకార సంఘం కీలక పాత్ర పోషిస్తోంది. చిరు వ్యాపారులకు వ్యవసాయ అనుబంధ రుణాలు మంజూరుచేస్తూ సహకరిస్తోంది. సంఘం అన్నదాతలకు చేయూతనిస్తూ అభివృద్ధి పథంలో పయనించేలా పాలకవర్గాలు పని చేస్తున్నాయి. గతంతో పోల్చితే ఇప్పుడు అభివృద్ధిలో దూసుకుపోతోంది. సమస్యలను పరిష్కరించి రైతులకు నాణ్యతతో కూడిన సేవలను అందిస్తోంది. పంటల కాలంలో రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకొని వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా సంఘం చైర్మన్, పాలకవర్గం, అధికారులు ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. మండల పరిధిలోని 31 గ్రామ పంచాయతీలు, తుక్కుగూడ మున్సిపాలిటీలోని నాలుగు గ్రామాలకు గాను మహేశ్వరం వ్యవసాయ సహకార సంఘం ఒక్కటే ఉంది. ఈ సంఘం ద్వారా 31 గ్రామ పంచాయతీలు, తుక్కుగూడ మున్సిపాలిటీలో ఉన్న గ్రామాల రైతులు వారికి కావాల్సిన ఎరువులు తీసుకుపోవడంతో పాటు వారికి కావాల్సిన రుణాలు తీసుకుని సకాలంలో చెల్లిస్తున్నారు.

రుణాలు పొందిన రైతులు

మహేశ్వరం సహ కార సంఘంలో మొత్తం 5,712 మంది రైతులు సభ్యులుగా ఉన్నారు. సంఘం ద్వారా ఇప్పటి వరకు 1,204 మంది రైతులకు రూ.5.65కోట్ల స్వల్పకాలిక రుణాలు((పంట రుణాలు) ఇచ్చారు. ఇందులో 90 శాతం రికవరీ చేశారు. దీర్ఘకాలిక రుణాలు(గొర్రెలు,గేదెలు, ఆవుల, మేకల పెంపకం,కోళ్ల ఫారం ఏర్పాటుకు, ట్రాక్టర్, హర్వెస్టర్ల కొనుగోలుకు రుణాలు) అర్హత కలిగిన 455 మంది రైతులకు రూ.8.75 కోట్ల రుణాలు ఇచ్చారు. ఇప్పటి వరకు 52శాతం రికవరీ చేశారు. పలువురు రైతుల దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని వారిలో అర్హులకు రుణాలు అందజేస్తామని సహకార సంఘం అధికారులు, చైర్మన్ వెల్లడించారు. సంఘం ఆధ్వర్యంలో గ్రోమోర్, డీఏపీ, యూరియా ఎరువులను విక్రయిస్తున్నారు. మొక్క జొన్న, కందులు, జీనుగ, జనుము విత్తనాలను సబ్సిడీపై అందజేస్తున్నారు. నాణ్యమైన తాండూరు కంది పప్పు 10 కిలోల బ్యాగుకు రూ.14,00, 25 కిలోల బ్యాగుకు రూ.3,200 ధరకు విక్రయిస్తున్నారు.

సరిపడా ఎరువులు



మహేశ్వరం సహకార సంఘం కార్యాలయంలో రైతులకు సరిపడ ఎరువులు సిద్ధంగా ఉన్నాయి. రైతులు ఎప్పుడు కావాలన్న అప్పుడు ఎరువులు తీసుకునే అవకాశం ఉంది. తాండూరు కంది పప్పు బ్యాగులను రైతులకు సరసమైన ధరలకే విక్రయిస్తున్నాం.

– కడమోని ప్రభాకర్ సహకార సంఘం డైరెక్టర్, మహేశ్వరం

అర్హులకు రుణాలు



అర్హులైన రైతులకు స్వల్ప, దీర్ఘకాలిక రుణాలు ఇస్తున్నాం. బంగారం, దస్తావేజులపై ఈ రుణాలు ఇస్తున్నాం. వ్యవసాయ అధారిత పరిశ్రమలు గొర్రెలు, మేకలు, కోళ్ల పెంపకం, ఆవులు, గేదెల షెడ్ల నిర్మాణానికి రుణాలు ఇస్తున్నాం. ట్రాక్టర్లు, హార్వెస్టర్ల కొనుగోలుకు సహకరించి వారి ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తున్నాం.

– షఫీ, సహకార సంఘం సీఈఓ, మహేశ్వరం

రైతు సంక్షేమానికి కృషి



రైతుల సంక్షేమానికి సహకార సంఘం పనిచేస్తోంది. ప్రభుత్వం ఆదేశించిన ధరలకే ఎరువులు విక్రయిస్తున్నాం. మంత్రి సబితారెడ్డి సహకారంతో సంఘాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తాం. రైతులకు అవసరమైన మేర రుణాలు ఇస్తూ.. సకాలంలో రికవరీ చేస్తున్నాం.

– మంచె పాండు యాదవ్, సహకార సంఘం చైర్మన్, మహేశ్వరం

పార్టీలకతీతంగా సంక్షేమ ఫలాలు

మంత్రి సబితారెడ్డి

కందుకూరు: పార్టీలకతీతంగా ప్రతీ ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందజేస్తున్నామని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి అన్నారు. శనివారం ఆమె మండల పరిషత్ కార్యాలయంలో ఆర్డీఓ సూరజ్‌కుమార్ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. పార్టీలకు అతీతంగా అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ మంద జ్యోతిపాండు, వైస్ ఎంపీపీ జి.శమంతప్రభాకర్‌రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.


కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులతో మంత్రి సబితారెడ్డి

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

బీజేపీ ఫ్లోర్ లీడర్ శివకుమార్

తుక్కుగూడ: గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్యంగా ఉండాలని బీజేపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వై.శివకుమార్ సూచించారు. శనివారం ఆయన మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల 4వ వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో పోషణపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రమం తప్పకుండా అన్ని రకాల పప్పు దినుసులు, కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, రాగిజావ తీసుకోవాలని చెప్పారు. తక్కువ బరువు ఉన్న పిల్లలకు బాలామృతం పంపిణీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ కె.విజయ, సిబ్బంది, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.


పోషకాహారం పంపిణీ చేస్తున్న శివకుమార్

అనర్హత వేటు కుట్రపూరిత చర్య

కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కృష్ణనాయక్

కందుకూరు: ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీపైఅనర్హత వేటు వేయడం కుట్రపూరిత చర్య అని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎస్.కృష్ణనాయక్, జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ ఏనుగు జంగారెడ్డి విమర్శించారు. శనివారం వారు మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. పార్లమెంట్‌లో అదాని వ్యవహారంపై ప్రశ్నలు లేవనెత్తడం.. 2019లో కర్ణాటక ఎన్నికల్లో లలిత్‌మోడీ, నీరవ్‌మోడీ తదితరుల ఆర్థిక నేరాలపై మాట్లాడినందుకే బీజేపీ కక్షపూరితంగా వ్యవహరిస్తోందన్నారు. కోర్టుకు వెళ్లే అవకాశం ఉన్నప్పటికీ 24గంటల్లోనే సభ్యత్వం రద్దు చేయడం సరికాదన్నారు. బీజేపీ చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రజలు రాహుల్‌కు అండగా ఉంటరన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు జి.ప్రభాకర్‌రెడ్డి, జిల్లా పార్టీ ప్రధానకార్యదర్శి బొక్క భూపాల్‌రెడ్డి, మాజీ పీఏసీఎస్ చైర్మన్ మల్లేశ్, మైనార్టీ అధ్యక్షుడు సయ్యద్ అజీజ్, ఈర్లపల్లి శ్రీకాంత్‌రెడ్డి, కత్తుల వెంకటేశ్, సురేశ్, శ్రీధర్, గణేశ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

రూ.144.62 కోట్లతో మున్సిపల్ బడ్జెట్

- ముంపు కాలనీలకు శాశ్వత విముక్తి
- మేయర్ చిగురింత పారిజాతారెడ్డి

బడంగ్‌పేట్: బడంగ్‌పేట కార్పొరేషన్‌లోని సమావేశ మందిరంలో శనివారం 2023-24 వార్షిక అంచనా బడ్జెట్ సమావేశాన్ని మేయర్ చిగురింత పారిజాతారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో మున్సిపల్ సాధారణ నిధుల నుంచి రూ.80.3 కోట్లు, క్యాపిటల్ ప్రాజెక్ట్ ఫండ్ నుంచి రూ.59.3 కోట్లు, డిపాజిట్లు మరియు అడ్వాన్సుల కింద రూ.5 కోట్లు మొత్తంగా రూ.144.62 కోట్లు వెచ్చించి చర్చించి, ఏకగ్రీవంగా ఆమోదించారు.

ఎస్‌ఎన్‌డీపీ పనులకు రూ.44 కోట్లు

ఈ ఏడాది ఎస్‌ఎన్‌డీపీ(స్పెషల్ నాలా డెవలప్‌మెంట్ ప్రోగ్రాం) బాక్స్ డ్రెయిన్ నిర్మాణ పనులకు సభ్యుల ఆమోదంతో రూ.44 కోట్లను వెచ్చిస్తున్నట్లు మేయర్ చిగురింత పారిజాతారెడ్డి పేర్కొన్నారు. గతేడాది మున్సిపల్ శాఖమంత్రి కేటీఆర్, విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి సంయుక్తంగా కలిసి ఎస్‌ఎన్‌డీపీ నాలా పనులు ప్రారంభించారని గుర్తు చేశారు. అయితే నిధులు లేమితో కాంట్రాక్టర్లు పనులను మధ్యలోనే వదిలేశారని గుర్తు చేశారు. అందుకే నాలా పనులు పూర్తి చేసి ముంపు కాలనీలకు శాశ్వత విముక్తి కల్పించేందుకు బడ్జెట్ నుంచి రూ.44 కోట్ల అంచనా నిధులను కేటాయించామని స్పష్టం చేశారు. అభివృద్ధికి సహకారం అందిస్తున్న పట్టణ ప్రజలకు, కార్పొరేటర్లకు, అధికారులకు ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యులు, సిబ్బంది తదితరులున్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ పారిజాతారెడ్డి

వార్డు అభివృద్ధికి నిరంతరం కృషి

కౌన్సిలర్ రవినాయక్

తుక్కుగూడ: వార్డు అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని 10వ వార్డు కౌన్సిలర్ బాదావత్ రవి నాయక్ అన్నారు. శనివారం ఆయన మున్సిపాలిటీ కేంద్రంలో రూ.5లక్షల నిధులతో చేపట్టిన మ్యాన్ హోల్ మరమ్మతు పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంత్రి సబితారెడ్డి నాయకత్వంలో రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.


మరమ్మతు పనులను పరిశీలిస్తున్న రవినాయక్

వక్తృత్వ పోటీలతో నైపుణ్యం పెంపు

మీర్‌పేట: వక్తృత్వ పోటీలతో విద్యార్థుల్లో నైపుణ్యం (కమ్యూనికేషన్ స్కిల్స్) పెంపొందుతుందని నారాయణ పాఠశాలల డీజీఎం గోపాల్‌రెడ్డి అన్నారు. మీర్‌పేట నారాయణ ఒలంపియాడ్ పాఠశాలలో శనివారం వనస్థలిపురం జోన్ వక్తృత్వ పోటీలు, స్నాతకోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గోపాల్ రెడ్డి మాట్లాడుతూ.. ఇలాంటి పోటీలు విద్యార్థులకు ఎంతో దోహదపడతాయని, పోటీల్లో మీర్‌పేట, జిల్లెలగూడ, ఆర్‌కేపురం, వనస్థలిపురం విద్యార్థులు పాల్గొని వక్తలుగా ప్రతిభ చాటారని అన్నారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పతకాలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం రవీంద్రబాబు, ప్రిన్సిపాల్ బాబ్జీ, శివరంజని, శ్రీవల్లి, కో ఆర్డినేటర్స్ మనోహర్‌రెడ్డి, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.


ప్రతిభ చూపిన విద్యార్థికి పతకం, ప్రశంసాపత్రం అందజేస్తున్న గోపాల్‌రెడ్డి తదితరులు

పెంచిన టోల్ చార్జీలను తగ్గించాలి

పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్

కడ్తాల్: కేంద్ర ప్రభుత్వం పెంచిన టోల్ చార్జీలను వెంటనే తగ్గించాలని పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం టోల్‌చార్జీలను 5నుంచి 10 శాతానికి పెంచినందుకు నిరసనగా బ్లాక్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో శ్రీశైలం-హైదరాబాద్ జాతీయ రహదారిపై టోల్‌ప్లాజా వద్ద శనివారం పార్టీ ఆధ్వర్యంలో ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతీ సంవత్సరం పెట్రోలు, డీజిల్ రేట్లతో పాటు టోల్ చార్జీలు పెంచుతూ రవాణారంగంపై పగబట్టినట్టు వ్యవహరిస్తోందని మండిపడ్డారు. రవాణా రంగాన్ని కేంద్ర ప్రభుత్వం కుదేలు చేస్తోందన్నారు. ఆందోళన చేపట్టిన ప్రదేశానికి పోలీసులు చేరుకుని ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా వారిని సముదాయించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, పార్టీ కడ్తాల్, తలకొండపల్లి మండలాల అధ్యక్షులు బీచ్యానాయక్, ప్రభాకర్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, సర్పంచ్ పాండు, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హీరాసింగ్, శంకర్, రాములు, సేవాదళ్ మండల అధ్యక్షుడు లక్ష్మయ్య, నాయకులు దశరథం, రామకృష్ణ, మల్లేశ్‌గౌడ్, అజీం, ఆరీఫ్, సత్యం, జవహర్, ఇమ్రాన్, భానుకిరన్, రాజేశ్, విజయ్, రవి, మహేశ్, రవీందర్, మల్లయ్య తదితరులు ఉన్నారు.



టోల్‌ప్లాజా వద్ద ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

జనాభా అవసరాలకు అనుగుణంగా వసతులు

హస్తినాపురం: హస్తినాపురం డివిజన్‌లో వెలుస్తున్న నూతన కాలనీల్లో పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా మెరుగైన వసతులను కల్పిస్తామని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడి సుధీర్‌రెడ్డి అన్నారు. శనివారం హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్‌తో కలిసి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ... డివిజన్ పరిధిలోని వివిధ కాలనీలలో అభివృద్ధి పనుల కోసం రూ. 5.25 కోట్లను మంజూరు చేశామన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు. త్వరలో ఆయా పనులను ప్రారంభిస్తామన్నారు. పార్కులు శ్మశాన వాటికల్లో బోర్‌వెల్స్ ఏర్పాటుకు రూ. 4.70 లక్షలు, రంజాన్ నేపథ్యంలో మసీదుల మరమ్మతులకు రూ. 4 లక్షలు మంజూరు చేశారని కార్పొరేటర్ వివరించారు.

కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలపై సీపీఎం నిరసన


ఎన్టీఆర్‌నగర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

దిల్‌సుఖ్‌నగర్: ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై సీపీఎం నాయకులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. సీపీఎం సరూర్‌నగర్ సర్కిల్ కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.గోపీనాయక్, కట్ట శ్రీనివాస్ నేతృత్వంలో శనివారం ఆర్‌కేపురం డివిజన్ ఎన్టీఆర్‌నగర్‌లో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... ప్రజలను డిజిటల్ పేమెంట్‌ల వైపు మళ్లించి ప్రస్తుతం ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎంలపై చార్జీలు విధిస్తూ ప్రజలపై దోపిడీకి పాల్పడుతోందన్నారు. పెట్రోలు, డీజిల్ ధరలకు అడ్డు అదుపు లేకుండా పోయిందని, నిత్యావసరాల ధరలు సామాన్య, మధ్య తరగతి ప్రజలకు అందని విధంగా పెరిగిపోతున్నా వాటిని కట్టడి చేయడంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విఫలం అయ్యిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ నాయకులు వెంకటేష్ యాదవ్, యాదయ్య పాల్గొన్నారు.

అధికారం కోసం బీజేపీ అడ్డదారులు

ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

హయత్‌నగర్: తెలంగాణలో అధికారాన్ని ఎలాగైనా సాధించేందుకు బీజేపీ అడ్డదారులు తొక్కుతోందని, కులాలు, మతాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టి పబ్బం గడుపుకోవాలని చూస్తోందని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఆరోపించారు. శనివారం హయత్‌నగర్‌లో జరిగిన బీఆర్‌ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్సీ బుగ్గారపు దయానంద్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ... బీజేపీ తన మూల సిద్ధాంతాలను పక్కన బెట్టి ప్రాంతానికో విధానాన్ని అవలంభిస్తోందని దుయ్యబట్టారు. ఎక్కడ ఎన్నికలు జరిగితే ఆ ప్రాంత ఓటర్లను ఆకర్షించేలా తమ సిద్ధాంతాలను మర్చుకుంటోందని తూర్పారబట్టారు. కర్నాటకలో ఎన్నికలు జరుగుతున్నందున అక్కడ మెజారిటీ కులానికి చెందిన లింగాయత్‌లకు రిజర్వేషన్లు పెంచుతున్నట్లు ప్రకటించారన్నారు. కరోనా కాలంలో ప్రపంచ కుబేరులంతా ఆదాయాన్ని కోల్పోతే 609వ స్థానంలో ఉన్న అదానీ మాత్రం ప్రపంచ కుబేరుల్లో రెండో స్థానానికి ఎలా చేరారని ప్రశ్నించారు. ప్రధాని నరేంద్ర మోదీ దేశ సంపదను అదానీకి దోచిపెట్టారని, దీనిపై సమాధానం చెప్పకుండా ప్రధాని తప్పించుకుంటున్నారని ఆరోపించారు. బీజేపీ ఎన్ని కుయుక్తులు చేసినా తెలంగాణ ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. నాలుగేళ్లలో ఎల్‌బీనగర్‌ను ఎంతో అభివృద్ధి చేశామని, ఆక్సిజన్ పార్కులు, ఫ్లైఓవర్లు, స్కైవేల నిర్మాణంతో పాటు చాలా కాలనీల్లో మెరుగైన వసతులు కల్పించామని ఆయన స్పష్టం చేశారు. పార్టీ డివిజన్ అధ్యక్షుడు చెన్నగోని శ్రీధర్‌గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో నాయకులు సామ తిరుమల్‌రెడ్డి, భాస్కర్‌సాగర్, భిక్షపతి, నక్క రవీందర్‌గౌడ్, మల్లేష్ ముదిరాజ్, ఉమాయాదవ్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

తోరణాలు తొలగించిన సిబ్బంది

మహేశ్వరం: మండల పరిధిలోని మన్సాన్‌పల్లి చౌరస్తాలో డాక్టర్ బీఆర్.అంబేడ్కర్, స్వామి వివేకానంద విగ్రహాలు కనిపించకుండా బీజేపీ, బీఆర్‌ఎస్ తోరణాలు కట్టారు. ఇదే విషయమై శనివారం ‘సాక్షి’ దినపత్రికలో ‘మహనీయులారా.. మన్నించండి’ అనే శీర్షికన వార్త ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందించిన మన్సాన్‌పల్లి పంచాయతీ కార్యదర్శి ఎండి.జావేద్ స్పందించారు. వెంటనే పంచాయతీ సిబ్బందితో తోరణాలు తొలగించి శుభ్రం చేయించారు. ఇకపై ఏ పార్టీ తోరణాలు, ఫ్లెక్సీలు కట్టినా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

సాక్షి ఎఫెక్ట్..

